క్లుప్తంగా

కాకనూరులో గ్రామసభ



కాకనూరు గ్రామ సభలో పాల్గొన్న ఏపీఓ వసుధ

బండిఆత్మకూరు: మండల పరిధిలోని కాకనూరు గ్రామంలో శుక్రవారం ఏపీఓ వసుధ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల పైబడిన వారు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కార్డులు ఇచ్చేందుకు, చనిపోయిన వారి పేర్లు తొలగించినట్లు తెలిపారు.

కళాశాల మైదానం శుభ్రం



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న అధ్యాపకులు

బండిఆత్మకూరు : స్థానిక జూనియర్ కళాశాల ఆట స్థలాన్ని అధ్యాపకుల ఆర్థిక సహాయంతో ఆటలకు అనువుగా తయారు చేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాలేజీ పరిసరాలు కంప చెట్లతో, చెత్త చెదారంతో అపరిశుభ్రంగా ఉండటంతో విష పురుగులు సంచరిస్తూ ఉండేవన్నారు. దీంతో కాలేజీ అధ్యాపకులు ముందుకొచ్చి సొంత డబ్బు ఖర్చుచేసి ఆట స్థలాన్ని పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు రఘునాథరెడ్డి, నజీరుద్దీన్, రామ సుబ్బారెడ్డి లు ఒక్కొక్కరు రూ.5 వేలు సహాయం చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



హైజిన్ కార్నర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ సుభాన్

నందికొట్కూరు: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఎంఈఓ సుభాన్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో హైజిన్ కార్నర్ సెంటర్‌ను ఎంఈఓ–2 శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామిరెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లకు తలుపుల ఏర్పాటు



మూత్రశాలలకు ఏర్పాటు చేసిన తలుపులు

పాములపాడు: మండలంలోని రుద్రవరం ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలకు తలుపులు ఏర్పాటు చేయించారు. మూత్రశాలలకు తెర వాడకం తీరును వివరిస్తూ ఈనెల 8న 'సిగ్గు.. సిగ్గు' కథనం సాక్షిలో ప్రచురించగా అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు బాత్‌రూమ్‌లకు తలుపులు ఏర్పాటు కావడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి బీఎల్‌ఓలకు శిక్షణా కార్యక్రమం

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 23 నుంచి 24 తేదీల్లో ఓట్ల నమోదుపై బీఎల్‌ఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని అర్హులైన యువతీ యువకులను కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం–6, అభ్యంతరాలకు సంబంధించి ఫారం–7పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

25 నుంచి బాల్‌రంగ్ ఉత్సవాలు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి బాల్‌రంగ్ ఉత్సవంలో భాగంగా ఈనెల 25 నుంచి 26వ తేదీ వరకు పోటీలు జరగనున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో 13 నుంచి 15 సంవత్సరాల్లోపు విద్యార్థులు పాల్గొనాలన్నారు. తప్పెట గుళ్లు, కర్రసాము, చెంచులవేట, దింసా, జులారీ, బంజార వంటి జానపద కళారూపాల్లో పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు కర్నూలు డైట్ లెక్చరర్ ప్రభాకర్ బాబు సెల్ : 8985126758 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సినిమాహాల్‌లో సిట్టింగ్ !

- బార్‌అండ్ రెస్టారెంట్‌గా పాత టూరింగ్ టాకీసు
- కేవలం మద్యం షాపునకే ప్రభుత్వ అనుమతి
- అయినా తాగేందుకు సకల సౌకర్యాలు కల్పించిన నిర్వాహకులు



టూరింగ్ టాకీస్‌లో ఏర్పాటు చేసిన మల్లన్న వైన్‌షాప్



మూతపడిన భ్రమరాంబా టాకీస్‌లో కుర్చీలు, బల్లలు వేసి తాగేందుకు ఏర్పాటు చేసిన దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని సున్నిపెంటలో వైన్‌షాపులు బార్ అండ్ రెస్టారెంట్‌ను తలపిస్తున్నాయి. అనుమతులు లేకున్నా షాపు వద్దే మద్యం సేవించేందుకు అవసరైన ఏర్పాట్లును చేశారు. తాగినోడికి తాగినంత, తిన్నోడికి తిన్నంతలా మద్యం ప్రియులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందుకు 20 సంవత్సరాల క్రితం మూతపడ్డ భ్రమరాంబా టూరింగ్ టాకీస్‌నే బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చేశారు.

పాత సినిమాహాల్‌లోనే సకల సౌకర్యాలు

అక్టోబర్ నెలలో జరిగిన మద్యం షాపుల లాటరీలో తెలంగాణాకు చెందిన ఇద్దరికి షాపులు దక్కాయి. వీరిరువురు సిండికేట్ అయ్యి సున్నిపెంటలో మూతబడిన భ్రమరాంబా టాకీస్‌లోనే రెండు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాలు ప్రారంభించినది మొదలు మద్యం ప్రియులు ఎక్కడికీ పోకుండా టాకీస్ లోపల, ప్రహరిలోనే మద్యం సేవించేందుకు అవసరమైన ఏర్పాట్లను షాపుల యజమానులు చేశారు. తాగినోడికి తాగినంత, తిన్నోడికి తిన్నంత అన్నట్లు అన్ని ఏర్పాట్లు చేశారు. టేబుళ్లు, కుర్చీలు సేతం వేశారు. ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం సిట్టింగ్‌కు ఎక్కడా అనుమతులు మంజూరు చేయలేదు. అయినా కూడా యథేచ్ఛగా మద్యం సేవించేందుకు వైన్‌షాప్ యజమానులు అనుమతిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులైతే తమ కార్లపై మద్యం ఉంచుకొని తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

తినుబండారాల అమ్మకాలకు రూ.లక్షల్లో వసూలు

సిండికేట్ అయిన రెండు వైన్‌షాప్ యజమానులు సినిమాహాల్ ప్రాంగణంలో నీళ్లు, గ్లాసులు, తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, చికెన్ పకోడి అమ్ముకోవడానికి నెలకు రూ.లక్షల్లో ధరను నిర్ణయించినట్టు తెలిసింది. లైసెన్సుదారులకు మద్యం అమ్మకాలపై ఎంత ఆదాయం వస్తుందో కానీ, ఈషాపుల కేటాయింపు వలన రెండు సంవత్సరాలలో సుమారు అరకోటి రూపాయలు ఆర్జించేందుకు రెండు వైన్‌షాపుల యజమానులు ప్రణాళిక చేసినట్టు తెలిసింది.



వైన్‌షాప్ ముందు జంకులేకుండా మద్యపాన సేవనం

సిట్టింగ్‌కు ఎటువంటి పర్మిషన్ లేదు

ఇప్పటి వరకు ఏ మద్యం షాపునకు ప్రభుత్వం సిట్టింగ్‌కు పర్మిషన్ ఇవ్వలేదు. సున్నిపెంటలో వైన్‌షాప్‌ల వద్ద తాగేందుకు షాప్ యజమానులు అనధికారికంగా అనుమతిస్తున్నట్లు తెలిసింది. మేం పరిశీలన జరుపుతాం. ఇటువంటి చర్యలకు పాల్పడితే వైన్‌షాప్ యజమానులపై కేసులు నమోదుచేసి, వారి లైసెన్స్‌లను రద్దు చేస్తాం.

– కిశోర్‌కుమార్, ఎక్సైజ్ సీఐ, ఆత్మకూరు

పూలతోటల సాగుతో అధిక ఆదాయం



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది: పూల తోటల సాగుతో సీజనల్ వారీగా ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిసరాల్లోని గులాబీ పూల సాగును శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటలు సాగు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎప్పుడూ ఒకే రకం పంటలు కాకుండా పలు రకాల పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. అధికారులు సైతం రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ పంట దిగుబడులు అధికంగా వచ్చేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఆమె వెంట జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

ఆత్మకూరు: యోగా, ధ్యానం ప్రతి ఒక్కరికి అవసరమని వాత్సల్య మిషన్ అధ్యాపకురాలు వేమ సుజాత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం సహజ యోగా ధ్యానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆరోగ్య విషయాలపై ధ్యానం ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి

పగిడ్యాల: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి ఎస్‌ఐ సి. శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమైన ఎస్‌ఐ ప్రశాంత జీవనం అలర్చుకోవాలని సూచించారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే వారిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. అదేవిధంగా పేకాట, మట్కా, ఆన్‌లైన్ ఆటలు ఆడొద్దని, కాపురాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు పెద్దల సమక్షంలో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే పోలీసులను ఆశ్రయించాలే తప్పా గొడవలకు పాల్పడొద్దని సూచించారు.

సచివాలయాల తనిఖీ



జియోట్యాగింగ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: మండలంలోని రుద్రవరం, జూటూరు, బానుముక్కల, బానకచెర్ల గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం హాజరు వేయాలను ఎంపీడీఓ ఉద్యోగులకు సూచించారు. ఎన్‌పీసీఐ అకౌంట్స్, జియో ట్యాగింగ్ హౌస్ హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా జూటూరు గ్రామంలో జరుగుతున్న జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలించారు.

చెట్ల నరికివేత చేపట్టిన స్థానికేతరులు

- అడ్డుకున్న స్థానికులు
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వ్యవహారం



ఇరువర్గాలకు సర్దిచెడుతున్న ఎస్‌ఐ కేశవ, పోలీసులు

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామ పంచాయతీ పరిధిలోని పాత సిద్ధేశ్వరం సమీపంలో కొన్నేళ్లుగా నీటిముంపు భూముల కోసం స్థానికులు, స్థానికేతరులకు మధ్య భూ వివవాదం జరుగుతుంది. ఈ సమస్యపై కోర్టులో కేసు కొనసాగుతునే ఉంది. అయితే శుక్రవారం కొందరు స్థానికేతరులు పాత సిద్దేశ్వరం గ్రామ సమీపంలో నివాసం ఏర్పరచుకునేందుకు చెట్లను నరుకుతున్నారు. గమనించిన కొందరు స్థానికులు స్థానికేతరులతో చెట్లు నరకొద్దని వాగ్వాదానికి దిగారు. దీంతో కొంతమేర ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు తహసీల్దార్ ఉమారాణి, ఎస్‌ఐ ఎం.కేశవ అక్కడికి చేరుకుని చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. ఇరువర్గాలను ఘర్షణ పడకుండా చెల్లాచెదురు చేశారు. ఇరువర్గాలతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్, ఎస్‌ఐ మాట్లాడుతూ పాతసిద్ధేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెం గ్రామాల మధ్య ఉన్న నీటిముంపు భూముల సమస్య ఇరిగేషన్ పరిధిలో ఉందని, కోర్టులో కూడా కేసు కొనసాగుతుందన్నారు. ఈ భూములపై సుమారు 8 ఏళ్ల నుంచి 145 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఈ భూముల్లో ఏ పనులు చేయకూడదన్నారు. స్థానికులు, స్థానికేతరులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, వీఆర్వో మౌలాలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి శుక్రవారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, ఖలీల్ గ్రామంలో దారిన వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా సైగలు చేస్తూ ఈలలు వేస్తున్నారని స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఏడు రోజులపాటు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు వివరించారు.

గర్భిణులు, బాలింతలకు కిల్కారి సేవలు

గోస్పాడు: గర్భిణులు, బాలింతలకు కిల్‌కారీ సేవలు సక్రమంగా అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద కిల్కారి సేవలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని సంబంధించి అవసరమైన సలహాలు, సంబంధించిన వారి మొబైల్ ఫోన్‌లో ప్రతి వారం డాక్టర్ ద్వారా అందజేస్తారన్నారు.

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తజనం



నోము పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: కార్తీకమాసం, శుక్రవారం పురస్కరించుకుని మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కార్తీక స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తులు సాధారణ, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ల ద్వారా గంటల తరబడి వేచి ఉండి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

కేదారేశ్వర వ్రతాలు

మహానందీశ్వరస్వామి సన్నిధిలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు శుక్రవారం కేదారేశ్వర వ్రతాలు చేసుకున్నారు. మహానందిలోని స్థానిక అలంకార మండపంలో భక్తులు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ ఆధ్వర్యంలో నోములు చేసుకున్నారు.

కల్యాణ వైభోగమే

మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు స్వామి, అమ్మవార్ల మూర్తులను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, మాంగళ్య ధారణ మహోత్సవం క్రతువులతో కల్యాణం వైభవోపేతంగా జరుగగా పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించారు.

డిసెంబర్‌లోపు భూసమస్యలు పరిష్కరిస్తాం

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వే జరిగిన గ్రామాల్లోని నెలకొన్న సమస్యలను డిసెంబర్‌లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పి.లింగాపురం, తంగడంచ, తరిగోపుల, తర్తూరు, తాటిపాడు గ్రామాల్లో సమగ్రభూసర్వే జరిగినట్లు తెలిపారు. సమగ్ర భూసర్వేలో నెలకొన్న తప్పొప్పులను సరిచేసేందుకుగాను గత నెల 22 నుంచి 29 వరకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

23, 24న ప్రత్యేక ఓటరు నమోదు: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. బీఎల్‌ఓలు వారి కేటాయించిన పోలింగ్ బూతుల వద్ద ఉంటూ ఓటర్ల నుంచి కొత్తగా ఓటుహక్కు నమోదు, ఓటరు జాబితలో మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

నాటుసారా స్వాధీనం

కొత్తపల్లి: ఓ మహిళ నాటుసారా విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎర్రమఠం గ్రామ పంచాయతీ మజారా గ్రామమైన కపిలేశ్వరంలో ఓ మహిళ నాటు సారా విక్రయిస్తుంది. గురువారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ వీరాస్వామి, జగదీష్, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆమెను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు వెల్లడించారు.

నాటుసారా తయారీదారుల బైండోవర్

నందికొట్కూరు: నాటుసారాయి తయారీ, అక్రమ మద్యం కేసులు నమోదు అయిన వారిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట 16 మందిని బైండోవర్ చేశామన్నారు.

దేవస్థాన చైర్మన్ మృతి

బండిఆత్మకూరు: స్థానిక జనార్దనస్వామి దేవాలయ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అవుటాల సుబ్బారెడ్డి(53) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. మూడు రోజులుగా ఆయన నంద్యాలలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య సుజాత, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అవుటాల కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆత్మకూరు: విశాఖపట్టణంలో ఇటీవల లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్, శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ మంజుల డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ, శ్రామిక మహిళా సంఘం, అఖిల భారత, ప్రజా తంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. విశాఖలో లా విద్యార్థిని మోసం చేయడంతో పాటు లైంగికంగా హింసించారని, ఫలితంగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు పెరిగాయని చెప్పారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు రాంనాయక్, రణధీర్, గోపాలకృష్ణ, లక్ష్మీదేవి, విజయలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ఆధార్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా చేశారు. పట్టణంలోని శారద లాడ్జింగ్ ఏరియాలోని ఆధార్ సెంటర్‌లో విద్యార్థులు రద్దీని గమనించిన వారు అక్కడే నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్లు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ చేయించుకోవడానికి నాలగైదు రోజుల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పనులు మానుకుని రోజుల తరబడి ఆధార్ కేంద్రం చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అదనంగా ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: ఏపీఎస్ ఆర్టీసీ ఆత్మకూరు డిపో నుంచి కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం వినయ్‌కుమార్, సీఐ కేపీనాయక్ శుక్రవారం తెలిపారు. శ్రీశైల క్షేత్రానికి వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ఉదయం, సాయంత్రం పెద్ద ఎత్తున బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం నుంచి మంగళవారం ఉదయం వరకు బస్సు సర్వీసులను కొనసాగిస్తామన్నారు.

శనగ పంటను తెగులు నుంచి కాపాడుకోవాలి



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నందికొట్కూరు: శనగ పంటను తెగులు నుంచి రైతులు కాపాడుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రామ కృష్ణారావు, నీలిమ, చైతన్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ పొలిమేరలో సాగు చేసిన శనగ పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఎండు తెగులు, మొదలు కుళ్లు తెగులు, లద్దె పురుగులు పంటను ఆశించినట్లు గుర్తించారు. ఎండు, మొదలు కుళ్లు తెగులు నివారణకు ఎకరానికి డైతేన్ ఎం–45 600 గ్రాములు, బావిస్టిన్ 200 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. లద్దె పురుగులు నివారణకు ఎకరానికి క్లోరీ ఫైరీపాస్ 500 మీలీలీటర్లు, అసిఫేట్ 300 గ్రాములు, ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు, క్లోరాత్రా నిలిప్రోలు 60 మీ.లీను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌లు పరిశుభ్రంగా ఉండాలి



బిజినవేములలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించాలన్నారు.

కొణిదేలలో జియో ట్యాగింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎదురుపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

కొత్తపల్లి: ప్రజలు నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఎదురుపాడు, కొక్కెరం గ్రామాలలో ఎస్‌ఐ కేశవతో కలసి పర్యటించారు. ప్రజలతో సమావేశమై నేరాలు, నేరస్తులపట్ల తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు, యువతులు, చిన్నారులు, వృద్ధులపై రోజురోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వీటిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్, ఓటీపీ మోసాల తీరును వివరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యంశెట్టి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశంలో మండలంలో వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, పండితులు, అర్చకులు మహానందీశ్వర ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించా రు. ముందుగా గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

ఆశా వర్కర్లపై వేధింపులు ఆపాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

బండిఆత్మకూరు: ఆశా వర్కర్లపై వేధింపులు ఆపాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొంతమంది ఆశా వర్కర్లను అక్రమంగా తొలగించి, తమ వారికి ఉద్యోగం కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక నేతలు వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆశా వర్కర్లు తక్కువ వేతనంతో అనేక రకాల సేవలు చేయించుకుంటున్నారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డాక్టర్ సవితకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు రాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.